
# ఆకాశ రామన్న

-మణినవకాంత్




మధు ఆఫీసు నుంచి ఇంటికొచ్చేప్పటికి - దివ్య దిగులుగా కూర్చు నుంది.

ఆమె చేతిలో పుట్టింటినించి వచ్చిన ఉత్తరం వుంది.

అలాంటి ఉత్తరం రావటంవల్ల - తన చెలెల్లు పెళ్లి ఆగిపోయిందని ఒక ప్రక్క బాధ, మరో ప్రక్క మగపెళ్లివాళ్లపై కోపమూ కలిగేయి దివ్యకి.

"దివ్యా! ఇలా జరుగుతుందని కలలో కూడా అనుకోలేదు. ఏ సమస్యకైనా పరిష్కారం చెయ్యగలుగుతాం కానీ ఈ నిందకేం చెయ్యగలం?....

దివ్య చేతిలోని ఉత్తరాన్ని తీసుకొంటూ దిగులుగా అన్నాడు మధు.

జయ దివ్య చెల్లెలు. చాలా అందంగా వుంటుంది. డిగ్రీ సెకండియర్ చదువుతూంటే మంచి పెళ్లి సంబంధం వస్తే - మధ్య తరగతి కుటుంబీకుడైన ఆమె తండ్రి గోపాలం మగపెళ్లివారితో ఒక్క సంవత్సరం ఆగమని చెప్పాడు.

వాళ్లు సరేనన్నారు.

జయ డిగ్రీ ఫస్టు ర్యాంకులో పాసైంది. వచ్చే మాఘ మాసంలో కళ్యాణం. శుభలేఖలు కూడా వేసేశారు. ఇంకో నాలుగు రోజులలో పెళ్లి వుందనగా - మగపెళ్లి వాళ్లకి వచ్చిందీ ఉత్తరం.

"ఒరే అబ్బాయ్! పెళ్లికి ముందే అమ్మాయి గురించి చెడుగా వార్తొచ్చిందంటే - మనకెందుకీ దిక్కుమాలిన సంబంధం... వదిలేద్దాం..."

"అది కాదు నాన్నా... అమ్మాయి అందంగా వుంటుంది."

"నోర్ముయ్! నాకెదురు చెప్తావురా?" తాచుపాములా లేచాడు పెళ్లి కొడుకు తండ్రి.

బెల్లం కొట్టిన రాయిలా తటస్థంగా వున్నాడు పెళ్లికొడుకు.

వెంటనే ఆడపెళ్లివాళ్లు బెంబేలెత్తిపోతూ, మగపెళ్లి వాళ్లని కలిశారు. కానీ ఫలితం శూన్యం.

ససేమిరా మేం చేసుకోమని - కళ్ల ముందే అదే ముహూర్తానికి మరొక అమ్మాయితో ఆ కుర్రాడికి పెళ్లి చేసేశారు తల్లిదండ్రులు. నోరు మెదపటానికి కూడా అవకాశం లేకపోయింది జయ తల్లిదండ్రులకి.

జయ, దివ్యలా పిరికి మనిషి కాదు. చాలా పట్టుదల గల పిల్ల. తండ్రి చదివించే స్థితి లేకపోయినా - తను కష్టపడి చదివి మెరిట్ స్కాలర్ షిప్ సంపాయించింది. డిగ్రీ పూర్తిచేసింది. అక్కడికీ డిగ్రీ అయ్యేంతవరకూ పెళ్లి ప్రయత్నాలు తలపెట్టవద్దంది. కానీ ఇలా జరుగుతుందని కన్న తండ్రిగా ఆయన మాత్రం ఎలా ఊహించగలడు?

జయకి మనసులో ఒకప్రక్క దిగులుగావున్నా - ఆత్మస్థైర్యంతో ముందుకి వెళ్తోంది. ఉద్యోగ ప్రయత్నాల్లో మనసుకి ఊరట కలుగచేసుకుంటోంది.

దివ్యకి పెళ్లైనా పిరికి పిల్లే.

చెల్లి పెళ్లి ఆగిపోయిందని పలకరించి వచ్చిందగ్గర్నుండి - ఆమె మనసేమీ

బాగోవటం లేదు.

ఆ ఉత్తరం రాసిన దుర్మార్గుడ్ని పట్టి - పోలీసులకి అప్పగించి వాడు మరే ఆడదాని జీవితంలోకీ వెళ్లకుండా చితక్కొట్టించెయ్యాలన్నంత కోపం వచ్చిందామెకి.

సాటి మనిషి సుఖ సంతోషాలని చూడలేని నికృష్ట జన్మలు కొన్ని వుంటాయి. అవేవో జయ జీవితం పట్ల శాపంలా ఎదురయ్యాయి. పెను తుఫాను చెలరేగినా, అగ్నిశిల పేలినా, ఏమి జరిగినా నిశ్చలమైన మనసుని ఏదీ చలింప చేయలేదు.

జయ మనసు అలాంటిదే!

ధైర్యమే ఆమె ఊపిరి.

గతంలో ఓసారి తన అక్క దివ్య విషయంలో ఆమె చూపిన నేర్పరితనం స్త్రీ లోకం గర్వించదగ్గది!

జయ, దివ్య రోజూ కాలేజీకి నడిచి వెళ్లి వస్తూండేవాళ్లు.

వీళ్ల ప్రక్క పోర్షన్‌లో భుజంగరావు కుటుంబం అద్దెకి వుంటున్నారు. భుజంగరావు కాంట్రాక్టరు. అతనికో కొడుకు క్రాంతి. వాడు డిగ్రీ అయిదారుసార్లు తప్పాడు. కన్పించిన ప్రతీ అడదాన్ని కామెంట్ చేసి ఏడ్పించడమే వాడి జీవిత లక్ష్యం.

ఎప్పుడైనా దివ్య గానీ, జయ గానీ ఆరుబయటి కొచ్చినా, బట్టలు ఆరేయటాని కొచ్చినా గుడ్లురిమి చూసేవాడు. వాళ్లని తినేసేటట్టు చూసేవాడు. వెకిలి చేష్టలన్నీ చేసేవాడు.

దివ్య అయితే భయంతో ఒణికిపోయేది.

జయ అలా కాదు - వాడి ప్రవర్తన వెంటనే తండ్రి కి చెప్పింది.

"వాడి గురించి వాళ్ల నాన్నతో చెప్తానమ్మా మీరు వాడి మొహం చూడకండి" అన్నారు గోపాలం జయతో.

గోపాలం భుజంగరావుని కల్సి అతని కొడుకు ప్రవర్తన గురించి చెప్పాడు. కొడుకు బుద్ధి మంచిది కాదని గతంలో అతనికి తెల్సున్న మీదట క్రాంతిని గట్టిగా మందలించాడు.

కానీ వాడు విన్పించుకోలేదు.

ఇంకా రెచ్చిపోయి దివ్య చేయి పట్టుకున్నాడు.

సమయానికి ఆయన చూశారు కాబట్టి సరిపోయింది. లేకపోతే దివ్య జీవితం ఏమైపోయేదో?

ఆయన వెంటనే కొడుకుని ఇంట్లోంచి వెళ్లగొట్టేశారు.

మూడ్రోజులు బయట తిరిగేప్పటికి బుద్ధొచ్చి - తప్పయిందని ఇంట్లో చేరాడు క్రాంతి.

వాడు ఇంట్లో చేరాడే కానీ - జయ దివ్యల మీద కక్ష పెంచుకుని వాళ్లని నాశనం చెయ్యాలని అవకాశం కోసం చూస్తున్నాడు.

అతగాడి చెయ్యి దివ్య మీద పడ్డప్పట్నించి దివ్య బయటికి రావాలంటేనే భయపడిపోయేది. కానీ జయ నిర్భయంగా వాడ్ని లెక్కచేయకుండా తిరిగేది.

దివ్య భయస్థురాలని వాడికి తెల్సిపోయింది.

తనని తండ్రితో తిట్టించి ఇంట్లోంచి గెంటించేలా చేసింది ఖచ్చితంగా జయే అని అనుకున్నాడు క్రాంతి.

దివ్యకి మంచి పెళ్లి సంబంధం రావటంతో ఆమెకి పెళ్లి చేసి పంపేశారు ఆమె తండ్రి.

ఇహ ఇంట్లో వుంది జయ. ఎదురుగా కేర్‌లెస్‌గా, తనని లెక్కచేయకుండా తల పైకెత్తి తిరుగుతోంది, దీనికెలాగైనా బుద్ధి చెప్పాలనుకొన్నాడు. జయ ఇంటికి కాలేజీకి రెండు కిలో మీటర్ల దూరం వుంది.

ఎప్పుడెప్పుడు జయ ఒంటరిగా దొరికితుందా ఆమెని - లోబరచుకోవాలని ప్రయత్నించసాగాడు.

ఎట్టి పరిస్థితుల్లోనూ - జయ సాయంత్రం ఆరు దాటకుండా ఇంటికి వచ్చేసేది. ఒకవేళ రాత్రిళ్లు ఎక్కడికైనా ఏ ఫ్రెండు దగ్గరికో, లేదా షాపుకో వెళ్లాల్సివస్తే కూడా తండ్రితో పాటే వెళ్లేది.

అలాంటిది - ఆ రోజు కాలేజీ ఏనివర్శరీ ఫంక్షన్.

ఆ ఫంక్షన్ చాలా పెద్ద ఎత్తున జరుగుతోంది. పైగా ఆ ఫంక్షన్‌లో ఒక డ్రామాలో నటించబోతోంది జయ.

ఆ ఫంక్షన్‌కి రమ్మని - తన డ్రామా చూడమని తండ్రిని పట్టుబట్టింది. కానీ గోపాలానికి అదే రోజున ముఖ్యమైన పని వుండటం వల్ల ఫంక్షన్‌కి వెళ్లలేకపోయారు.

ఇది క్రాంతికి - జయ ఒంటరిగా దొరికే అవకాశమైంది.

ఆరోజు రాత్రి కాలేజీ ఫంక్షన్ చాలా గ్రాండ్‌గా జరిగింది. డ్రామాలో జయ చాలా అద్భుతంగా నటించింది.

స్నేహితులతో కలిసి కొంతదూరం వచ్చాక జయ ఒంటరిగా ఇంటివైపు వస్తోంది.

ఆ వీధిలోనే ఎప్పుడూ ఖాళీగా వుండే ఒక పాత బిల్డింగ్ అరుగు మీద చీకట్లో కూర్చొని వున్నాడు క్రాంతి. వాడి బిచాణా ఎప్పుడూ అక్కడే. చిక్కింది అవకాశం అనుకున్నాడు. పైగా రాత్రి. వీధి దీపాలు వెలగడం లేదు. ఒక్క పురుగు లేదు. క్రాంతి ఆమె వెనకే వెళ్లి అమాంతం ఆమెని వెనకనించి పట్టుకున్నాడు బలంగా.

ఆమె అరుస్తోంటే ఆమె నోరు మూసి - కత్తి చూపించి బెదిరించాడు.

ఆమెని వరండా దగ్గరకి లాక్కొచ్చేశాడు. జయ గుండెల్లో దడ. ఒళ్లంతా చెమటలు పట్టేశాయి. అయినా ఆమెలో దాగివున్న శక్తి ప్రజ్వరిల్లింది.

అణుచుకోలేని కోపంతో ఆమె శక్తినంతా కూడదీసుకుని అతి బలంగా వాడిని ఒక్క తన్ను తన్నింది.

'అమ్మో' అంటూ రెండు చేతులూ రెండు తొడల మధ్య పెట్టుకుని కెవ్వున అరిచాడు. అలా గోడవైపుకు వాలుతూ చతికిలపడ్డాడు.

అదే అదనుకొని అక్కడ్నించి ఇంటివైపు పరిగెట్టింది జయ.

★ ★ ★

తన కూతురిపై క్రాంతి చేసిన అఘాయిత్యానికి భుజంగరావుని నిలదీసి అడిగాడు గోపాలం.

"వాడు నా కొడుకు కాదు. మీ ఇష్టమొచ్చిన రీతిలో మీరు వాడ్ని శిక్షించండి. వాడు మా మాట వినేలా లేడు. ఇంట్లోంచి పొమ్మంటే పోడు. కన్న పాపానికి తల్లిగా పేగు తీపి చంపుకోలేక వాడికింత ముద్ద పడేస్తోంది. ఆ ముద్దే వాడ్ని పశువుని చేస్తోంది. చెండాలపు వెధవ. మా కడుపున చెడబుట్టాడు" బాధగా కొడుకుని తిడుతూ - కూతురికి జరిగిన అన్యాయానికి క్షమించమని కోరుతూ ఆయన పరిష్కార మార్గంగా ఒక నిర్ణయానికొచ్చారు. ఆయన కుటుంబం మకాం - సిటీకి దూరంగా కొడుకుతోసహా మార్చాలనుకున్నాడు.

"నాన్నా! ఆయనే ఉద్దేశంతో వున్నా వాడు కిరాతకుడు. ఇంకో వూరు వెళ్లినా వాడి దుర్మార్గం పోదు. వాడికి సరైన బుద్ధి చెప్పాలంటే మరో ఆడదాని జీవితానికి కళంకం కాకుండా వుండాలంటే - వాడ్ని పోలీసులకి అప్పగించి చితగ్గొట్టించండి. అలా చేస్తే వాడు నాకు చేసిన పరాభావానికి వాడికి తగిన బుద్ధి చెప్పినట్టవుతుంది. అలా జరిగిన రోజున వాడు పరాయి స్త్రీని కన్నెత్తి చూడటానికి కూడా భయపడతాడు."

"అమ్మా! ఎటూ వూరెళ్లి పోతానంటున్నారు కదా! వాడి దుర్మార్గం వాడినే నాశనం చేస్తుంది."

"నాన్నా! వాడికి బుద్ధి చెప్పకపోతే నేను బ్రతికినా చచ్చినట్టే. నేను చస్తే మీరీ మాట అని వుండేవారా? కన్న తండ్రికి కూడా వాడు కసాయివాడనిపించినప్పుడు వాడ్ని కరుణించకూడదు."

"అమ్మా చిన్నదానవు నువ్వూరుకో - ఆవేశంలో వున్నావు. పోలీసుల జోలికి వెళ్తే వాళ్లు, మనం గొడవపడి బజార్లో నానా అల్లరైపోతాము."

"నాన్నా! ఇంత జరిగాక తెలియకుండా ఎలా వుంటుంది? నా మాట విని పోలీసు కంప్లైంట్ ఇవ్వండి."

"నేనా? ఇప్పుడా..."

"అవును"

"అదీ.... అదీ"

"మీరివ్వకపోతే నేనిస్తాను. మీరే మాత్రం సందేహించినా - వాడు నా జోలికి రావటం మాత్రం మానడు. అదే జరిగితే ఆడదానిగా మగవాడ్ని ఎదిరించే శక్తి నాకుంటుందా?"

కూతుర్ని తీసుకుని స్టేషనుకెళ్లాడు గోపాలం.

స్టేషన్‌లో క్రాంతికి దేహశుద్ధి చేశాడు ఇన్‌స్పెక్టర్.

జీవితంలో ఏ ఆడదాని జోలికీ వెళ్లని విధంగా వాడ్ని శిక్షించారు.

ఆ వూర్లో వుంటే వాడింక బాగుపడడని - మకాం వేరే సిటీకి మార్చేశారు భుజంగరావు.

జయ వాడికి బుద్ధి చెప్పినందుకు వూరూ వాడా వేనోళ్ల కొనియాడారు. మహిళా సంఘాల కమిటీ సభ్యులు అంతా వచ్చి ఎంతో మెచ్చుకున్నారు. ఆమెను తమ సంఘంలో మెంబర్‌గా కూడా వుండమన్నారు.

'నేను ఉద్యోగ ప్రయత్నాల్లో వున్నాను. కమిటీలో చేరేంత వయసూ అనుభవమూ రాలేదు నాకు. చేరాలన్న ఉద్దేశ్యం ఏర్పడితే తప్పక వచ్చి చేరతా'నని చెప్పి వాళ్లని పంపించింది.

ఇలా జయ వార్తా పత్రికలకి కొంత సంచలన వార్త అయింది.

★ ★ ★

ఓ ఉద్యోగంలో సెటిలయింది జయ.

రెండూ మూడు సంబంధాలొచ్చినా పెళ్లికి సుముఖత చూపలేదు ఆమె.

తండ్రి ఓ సంబంధం అనుకుంటే ఓ ఆకాశరామన్న ఉత్తరం వల్ల అది కాస్తా తప్పిపోయింది. జయ సమస్య తీరని బెంగగా పరిణమించింది.

ఆ మూడు ముళ్లూ పడితే ఆమె బ్రతుకికక ధోకా వుండదని ఆ తండ్రి తపన -

దివ్య, మధు పరామర్శకై వచ్చారు.

ఒకవిధంగా చెప్పాలంటే వాళ్లొచ్చింది జయని పెళ్లికి ఒప్పించటానికే.

జయ ఆఫీసుకి వెళ్లింది.

గోపాలం "అల్లుడు గారికి కాళ్లు కడుక్కోటానికి నీళ్లివ్వవే" అన్నాడు.

భార్య వంటింట్లోకెళ్లి నీళ్లు తెచ్చింది. కాళ్లు కడుక్కున్నాడు మధు.

"మావయ్యా... ఒంట్లో ఎలా వుంటోంది?" అన్నాడు మధు.

"ఆ... బానేవుంది అల్లుడుగారూ..." అన్నారు గోపాలం.

"నాయనా... ప్రయాణం అదీ సాఫీగా జరిగిందా?" అంది అత్తగారు.

"ఆ... రిజర్వేషన్ చేయించుకుని వచ్చాం అత్తయ్యగారూ... దివ్య ఈ మధ్య జయ గురించి బాగా బెంగపెట్టుకుంది. జయ పెళ్లి గురించి ఒకటే బాధపడుతోంది. చిన్నపిల్ల. ఆమెకిక్కడ ద్రోహం తలపెట్టేవారెవరున్నారో నాకేమీ బోధపడటం లేదు."

"మాకు అదే ఆశ్చర్యంగా వుంది బాబూ... మునుపు ఎవడో త్రాష్టుడు అల్లరి చేయబోతే వాళ్ల నాన్న వాడితో బాటే మకాం మార్చేశారు. పోతే అది ఇంతకు ముందు ఒక ప్రైవేట్ కంపెనీలో కొన్నాళ్లపాటు చేసింది. అక్కడా ఎన్నాళ్లో చెయ్యలేదు."

"మరి అక్కడ ఎందుకు మానేసినట్లు...."

"కారణం తెలియదు. ఆ ఉద్యోగం మానేసిన రెణ్ణెల్లకి దానికి గవర్నమెంట్ ఉద్యోగమొచ్చింది. తెలివైన పిల్లే కదా! దాని రాతే ఇలా వుంది నాయనా."

"అత్తయ్యా! జయ జీవితం గురించి, మీరేం దిగులుపడద్దు. ఆమె ఆశయాల్ని, అభిరుచుల్ని పేపర్లోనూ, పత్రికల్లోనూ వచ్చిన వార్తలను బట్టి తెల్సుకొని - నా స్నేహితుడొకరు ఆమెను పెండ్లి చేసుకోవాలనే తన ఉద్దేశాన్ని తెలిపాడు. అతనిది మంచి ఉద్యోగం. అందుకని నేరుగా దివ్య చేత జయని అడిగించుదామని బయలుదేరి వచ్చాం. జయకి దివ్య అంటే ప్రాణం కదా. ఆమె మాటకి విలువిచ్చినా ఆమె జీవితం బంగారు బాట కాగలదని నా ఉద్దేశం" అన్నాడు మధు.

"అల్లుడుగారూ! ఈ పెళ్లికి మీరే నడుంకట్టుకోవాలి!"

"దాందేముంది మావయ్యా! మన జయకి అందం లేదా, చదువు లేదా, సంస్కారం లేదా. మీరెందుకంత గాబరాపడతారు."

"అలా అని కాదు. జయ పట్టుదల గల పిల్ల. దానికి కుండబద్దలు కొట్టి చెప్పటం చిన్నప్పట్నించీ అలవాటు. ఎప్పుడూ ధర్మపథంగా నడుచుకోవాలంటుంది. కానీ ధర్మానికి వెడితే ఎక్కడ నెగ్గుకురాగలం చెప్పండి. ఎంతైనా ఆడపిల్లని ఓ అయ్య చేతిలో పెడ్తున్నాం కనుక - వాళ్ల మాటకి కట్టుబడాలి కదా!"

"అవును...."

"అలా జయ వుండదే. వాళ్ల దగ్గర మనమెందుకు లోకువవ్వాలి అంటుంది. అలా భీష్మించుకు కూచుంటే ఆ పిల్ల పెళ్లి చెయ్యగల్గుతామా... అదే నా భయం..."

"మనకా కంగారేం అక్కర్లేదు మావయ్యగారూ! ఆమె ప్రిన్సిపల్స్ అన్నీ విశదంగా నా స్నేహితుడికి వివరించాను. వాడన్నిటికీ ఒప్పుకున్నాడు."

"అంటే... మంచి ఉద్యోగస్థుడంటున్నారు - వాళ్లే స్థాయిలో వున్నారో..."

"ఏ స్థాయిలో వున్నా మనకందుబాటులో వున్న సంబంధమే! అన్నిటినీ మించి కుర్రాడు చాలా మంచివాడు. కట్న కానుకల విషయం కాటాలో తూస్తే సరిగ్గా మన జయకి సమంగా తూగుతాడు. అతగాడికీ ఈ కట్నాలు గట్రా సుతారము ఇష్టంలేదు. మనకిష్టమొచ్చినది, మనం ఇవ్వగలిగింది పిల్లకిచ్చుకొని ఆడంబరాలు లేకుండా... పెళ్లి జరిపించినా సంతోషంగా మన జయని చేసుకొంటాడు."

"బాబూ నిజమా..." అంది అత్తగారు.

"అవును అత్తయ్యా! అతనికి మన జయ నచ్చటం అదృష్టం అనే చెప్పాలి."

"అరే... మన జయని చూడకుండా అతనికి తను ఎలా నచ్చింది బాబూ" అంది అత్తగారు.

"అమ్మా.. మా పెళ్లి ఫొటో ఆల్బమ్‌లో జయ ఫొటో చూసినప్పుడే జయని చూపిస్తూ, 'ఈ అమ్మాయెవరూ - పెళ్లైందా' అని, మా ఇంటికొచ్చినప్పుడు వార్ని అడిగారు ఆయన" దివ్య తల్లితో అంది.

"అలాగా" అన్నారు గోపాలం.

సాయంత్రం జయ వచ్చాక పెళ్లి ప్రస్తావన దివ్య ద్వారా అడిగించి - ఆమెని ఒప్పించుదామని నిర్ణయించుకున్నారందరూ.

★ ★ ★

పెళ్లీడు ప్రాయంలోకి అడుగుపెట్టిన జయకెదురయిన సంఘటనల వల్లనూ, వ్యక్తుల వల్లనూ ఆమెకి మగవాళ్లంటే అసహ్యం కలిగింది. ఏ మగాడైనా అంతే ప్రతిఫలం ఆశించే ముందుకి రావటం - పరాకాష్టకెళ్లాక అదను చిక్కిన లేడి పిల్లల్ని నమ్మించి బలిచెయ్యటం - దాన్ని ప్రేమ అనే పదంతో కలిపి చెలగాటమాడటం - మనసులోనే మగవాళ్లకు తన జీవితంలో స్థానం లేదనే నిర్ణయానికొచ్చింది జయ.

జయ గతంలో పనిచేసిన ప్రైవేటు కంపెనీలోనే నీరజ పనిచేస్తోంది. ఇద్దరూ ఒకే ఈడు వాళ్లవటంతో స్నేహం కలిసింది.

ఓ రోజు నీరజ తన కుటుంబ పరిస్థితులన్నీ వివరిస్తూ తనొక అబ్బాయిని ప్రేమించానని చెప్పింది. అతను చాలా మంచివాడు అని చెప్పింది. "ప్రేమించే దానివైతే అతని అభీష్టం తెల్సుకొని - అతని అంతరంగంలో విలువనిచ్చి తద్వారా పవిత్రమైన బంధానికి బాటగా నిలుస్తాడో లేదో ముందు తెల్సుకో" మంది. జయ.

"అలాగే" అంది నీరజ.

ఆ అబ్బాయి అరవింద్.

"నా హృదయంలో చోటుంది. అది నీకే. మావాళ్లేమంటున్నా సరే. వాళ్లని ఒప్పించి నిన్ను నాదాన్ని చేసుకుంటాను. ఈ ప్రపంచంలో నువ్వు తప్పితే నాకు మరెవ్వరూ కనపడటం లేదు. అంతగా మావాళ్లు వద్దంటే మనిద్దరం

### వివాహాలు.....

**పోలిగమి** : ఒక పురుషుడు ఎక్కువమంది భార్యలను కలిగి వుండటాన్ని పోలిగమి అంటారు. ఈ ఆచారం ముస్లింలలో వుంది.

**పోలియాండ్రి** : ఒక స్త్రీ ఎక్కువ మంది భర్తలను కలిగి వుండటాన్ని పోలియాండ్రి అంటారు. ఈ ఆచారం లడక్ ప్రాంతంలో, హిమాచల్ ప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో వుంది.

**మొనోగమి** : ఒక పురుషుడు ఒకే స్త్రీని వివాహ మాడి ఏకపత్నీ వ్రతుడిగా వుండటాన్ని మొనోగమి అంటారు.

**ఎండోగమి** : ఒక జాతిలోని పురుషుడు అదే జాతిలోని స్త్రీని వివాహ మాడటాన్ని ఎండోగమి అంటారు.

**ఎక్సోగమి** : ఒక జాతిలోని పురుషుడు వేరొక జాతిలోని స్త్రీని వివాహమాడటాన్ని ఎక్సోగమి అంటారు.

-డా. అల్ల లక్ష్మీరమణమూర్తి

వాళ్ళకి దూరంగా వెళ్లిపోదాం" అన్నాడు. అదే నీరజ జయతో చెప్పింది.

ఈలోగా ఆమెకొక పెళ్లి సంబంధం వచ్చింది.

ఆమె సంకటస్థితిలో పడింది.

అరవింద్‌ని ప్రేమించానన్న విషయం ఎలా ఇంట్లో చెప్పాలా అని.

అందు గురించే కంగారుపడుతూ జయతో చెప్పింది.

"నువ్వేం కంగారుపడకు. అతను నిజంగా ప్రేమిస్తున్నాడంటే ఒక్కటే లెక్క. నువ్వు ఈ పెళ్లి విషయం చెప్పు. అతనేమంటాడో తెల్సుకో" అంది.

"మా అమ్మా నాన్నా ఒప్పుకోవటం లేదు. మీ అమ్మానాన్న దగ్గరకొచ్చి చెప్పటానికి - నాకు ధైర్యం చాలటం లేదు. మీవాళ్లు చెప్పినట్లు ఆ పెళ్లి చేసుకో కానీ మన బంధం విడిపోకూడదు... ఎందుకంటే ఐమీన్ - నువ్వు లేందే నేను బ్రతకలేను" అన్నాడు ఈసారి అరవింద్ నీరజతో.

ఇదంతా విన్న జయ - "నీరజా! వాడికి నీమీద వున్నది శరీరవాంఛే కానీ, ప్రేమ కాదు. పిచ్చిగా అతని భ్రమలో పడి బంగార భవిష్యత్తు పాడుచేసుకోకు" అంది.

జయ మాట విన్న నీరజ పెద్దలు కుదిర్చిన పెళ్లికి అంగీకారం తెలిపింది. ముహూర్తాలు కూడా నిర్ణమయ్యాక - ఆ త్రాష్టుడు నీరజ జీవితంలో నిప్పులు పోశాడు. తనకి దక్కలేదన్న ఈర్ష్యతో నీరజపై మగ పెళ్లివాళ్లకి ఒక్క చెడుని ఆమెపై పులిమి ఆకాశరామన్న ఉత్తరం రాసి, వికాటాట్ట హాసం చేశాడు.

పెళ్లి చెడిన ఆమె ఇంకా ఆ ప్రైవేటు కంపెనీలోనే బ్రతుకీడుస్తోంది. నీరజ జీవితం అలా అయితే సరిగ్గా ఏ వ్యక్తి అయితే నీరజకి ఆకాశరామన్న ఉత్తరం రాసి ఆమెని నవ్వులపాలుకి గురిచేశాడో అదే వ్యక్తి.. అరవింద్, తన జీవితంలో పెద్దల మూలంగా మధ్యవర్తి సహాయంతో తనని చేసుకోబోయే పెళ్లికొడుకుగా ప్రత్యక్షమయ్యాడు.

ఇంతకన్నా మంచి సంబంధం రాదన్న ఉద్దేశ్యంతో జయ తండ్రి గోపాలం ముహూర్తాలు మాట్లాడేశాడు.

ఏ ప్రగతినాశించి తను ముందుకు వెళ్లాలనుకుంటున్నదో అందుకు ప్రతిబంధకంగా తను బలి కాబోతోన్నదని కుమిలిపోయింది. తను చేసుకోనంటే తండ్రి మరణానికి ముందడుగు వేస్తున్నాడు. ఆ భయం కళ్ల ముందున్నప్పుడు ఆమె చేయగలిగిందేముంది.

కానీ... పెళ్లి నాలుగు రోజులుంది అనగా గోపాలానికి మగపెళ్లి వాళ్లు పంపిన వర్తమానంలో "మేం చేసుకోము - వేరే అమ్మాయిని చేసుకుంటున్నామని" అన్నారు జయపై అభాండాలు వేస్తూ. అతడు వేరే పెళ్లి చేసుకున్నప్పుడు కూడా జయ సంతోషించలేదు. దుఃఖించింది. మరొక అమ్మాయి ఆ త్రాష్టుడికి బలికాబోతోందని -

జయ పెళ్లి చేసుకోబోయిన వ్యక్తి అరవింద్ కాకపోతే ఆమె పరిస్థితి ఏమయ్యేదో.

ఏమైనా - ఇలాంటి సంఘటనలు ఆమె జీవితంలో ఎదురైన దృష్ట్యా - ఆమె దృష్టిలో మగవాడికున్న స్థానం ఊహించుకోగలం -

అందుకే పెళ్లి అంటే ఆమె విరక్తి చెందింది.

సమాజంలో పెళ్లిళ్ల పేరిట సాగుతోన్న ఆర్భాటాలు, కట్నాలు కానుకలు మనుష్యుల వ్యక్తిత్వాల్ని మంటగలిపే సాధనాలని ఆమెకి - ప్రగాఢ విశ్వాసం!

అందుకేనేమో ఆ విరక్తి!

జయ ఆఫీసు నుంచి వచ్చేప్పటికి హాలంతా కళకళలాడుతూ వుంది, అక్కా, బావలతో.

వచ్చీ రాంగానే జయని దివ్య గదిలోకి తీసుకెళ్లిపోయింది.

"జయా! నీ గురించే నా దిగులంతా. నేను మనశ్శాంతిగా వుండాలంటే నాకో మాటివ్వాలి."

"అక్కా చిన్నపిల్లలా ఏవిటా కన్నీళ్లు... ఇప్పుడేమైందని."

"అదేం కాదు నాకు మాటిస్తావా?"

"ఏమిటో చెప్పకుండా ఎలా?"

"అవును... నువ్వూ నాలాగా సంతోషంగా వుండాలి. కాని పక్షంలో అమ్మానాన్నా మనోవ్యధతో క్రుంగిపోయి చనిపోవటం ఖాయం. నేను దూరంగా సుఖంగా వుంటున్నానుకొంటున్నావా?"

"అక్కా..."

"అందరూ అలా వుంటారని భావించటం మూర్ఖత్వం జయా!"

"అక్కా! నువ్వెన్నైనా చెప్పు - కానీ పెళ్లి మాత్రం నాకిష్టం లేదు."

"అదే... ఏం ఎందుకని?"

"ఏ మగాడ్నీ నేననమ్మలేను."

"నీ పిచ్చిగానీ.... ఎవడో ఏదో అల్లరి చేశాడని... ఏవడో ఏదో ఉత్తరం రాసి పెళ్లి కూల్చాడని - ప్రతి వాడ్ని ఆ కోవలోకే జమకట్టి బంగారం లాంటి జీవితాన్ని బలిచేసుకుంటావా?"

"అందుకని" తీక్షణంగా చూసింది జయ.

"జయా! అయిదువేళ్లూ ఒక్కలా వుండనట్టే అందరు మనుషులూ కూడాను. మగాళ్లందరినీ దెప్పుతున్నావ్? మీ బావ అలాంటివారా? చెప్పు."

"నువ్వదృష్టవంతురాలివే. నాకు నామీద నమ్మకం లేదు."

"అదృష్టం అంటూ వెతుక్కుని రాదే పిచ్చి మొహమా! అది మనలోనే మనతో పాటే ఉంటుంది."

"ఓహో ఏమిటో అది ఎక్కడుందో నా మనసుకేమీ తెలియటంలా. అందుకే ప్లీజ్ దయచేసి ఈ విషయంలో నన్ను బలవంతపెట్టొద్దు."

"జయా! సీరియస్‌గా చెపున్నా. నీకు పెళ్లి జరక్కపోతే - ముందు అమ్మా నాన్న కాదు. నేను బ్రతకను."

"ఎందుకక్కా అలా మాట్లాడతావు?"

"అవును జయా! మీ బావ ఫ్రెండొకాయన - నీ గురించి పత్రికల్లో రాసిన దాన్నిబట్టి నీ ఆదర్శాలను, అభిప్రాయాలను మెచ్చుకొని నిన్ను మనసారా పెళ్లి చేసుకోవాలని వాంఛిస్తున్నాడు. మంచివాడు, ఉద్యోగస్థుడు, పైగా మీ బావకి స్నేహితుడు."

"అపక్కా" అని జయ అంటూండగా అప్పటివరకూ వాళ్ల సంభాషణ వింటున్నాడేమో మధు గదిలోకొచ్చాడు.

"దివ్యా! అక్కగా నీ మాటకి విలువ ఇవ్వనప్పుడు మనం ఇక్కడ వుండటం అనవసరం. పద వెళ్దాం."



## వైద్య వృత్తిలో డా॥ విజయకుమారి

అన్నిరకాల వైద్య విధానాలు - ఆయుర్వేద, హోమియో, నేచరోపతి, అలోపతి - పద్ధతుల్ని రోగుల కనుగుణంగా వాడుతూ స్వయం కృషితో డాక్టరు అయిన వనిత శ్రీమతి విజయకుమారి. పూర్తి తెలుగు వారైనా 8వ క్లాసు దాకా కన్నడ మీడియం చదివి, 14వ ఏట మేనమామని పెళ్లాడారు. 16వ ఏటనే తల్లి అయ్యారు. ముగ్గురు కూతుళ్లు. తన 21వ ఏట విజయకుమారి ఇంగ్లీష్ మీడియంలో ఎస్.ఎస్.ఎల్.సి. పాసై భర్త ప్రోత్సాహంతో, ఉమ్మడి కుటుంబంలో పని పాటలు పూర్తి చేసి, పిల్లలు స్కూలుకెళ్లిన తర్వాత ట్యుటోరియల్ కాలేజీలో చేరి 75% మార్కులు పొంది, మౌంట్ కార్మెల్ కాలేజీలో పి.యు.సి చదివారు. డాక్టరవ్వాలనే కోరికతో 51/2 సం॥ అయుర్వేదం కోర్సు జయ చామరేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్‌ల్లో చదివారు. పిల్లల చదు వులు హోం వర్క్ అయిన తర్వాత రాత్రి 10 గం॥కి చదువుకోటం మొదలెట్టి ఒంటి గంట దాకా చదివి, తిరిగి తెల్లారు ఝామునే లేచి గృహకృత్యాలు ముగించేవారు. అలోపతి కండెన్స్‌డ్ ఎం.బి.బి.ఎస్. చేసేప్పుడే మూడవ పాప పుట్టింది. హోమియో మెడిసిన్ పోస్టల్ ట్యూషన్ ద్వారా, నేచురోపతిలో డిప్లమా చేశారు. 1982లో ప్రాక్టీస్ ప్రారంభించి "కంబైన్డ్ ట్రీట్‌మెంట్" చేస్తున్నారు. ఈమె దగ్గరికి ఫారినర్స్ ముఖ్యంగా ఆఫ్రికన్స్, జర్మన్లు, ట్రీట్‌మెంట్ కోసం వస్తూంటారు. ఇంట్లో క్లినిక్ కాక, గ్రామాల్లో కాంపులు నిర్వహించి చికిత్స చేస్తున్నారు.

-అచ్యుతుని రాజ్యశ్రీ

"బావా!"

"అవునమ్మా.. నీ దృష్టిలో నేనూ వెధవనే. అంతే కదా! మగాడంటే అంత నీచమైన అభిప్రాయమున్నదంటే - నేనూ నీతో చెపుదామనుకున్నాను. ఆ అర్హత పూర్తిగా తుడిచిపెట్టేశావే.... ఇంకేమని నీకు చెప్పగలను." కోపంగా అంటూ దివ్యని లాక్కెళ్లాడు.

"బావా!" పిలుస్తూ వెంబడించింది జయ.

జయకి తన ఆశయాలెలా వున్నా, సమాజంలో బ్రతుకును కొనసాగిస్తూ పది మందినీ సుఖమయంగా వుంచాలంటే బంధాలతో మిళితమవ్వటమే ఆచరణీయంగా తోచింది.

"బావా! అక్కా!......" పరిగెడుతూ వాళ్లదగ్గరకెళ్లింది.

బావ దగ్గర సూట్‌కేసు తీసుకుంది. దివ్యని తనతో పాటే లోపలికి తీసుకొస్తూ, "బావా! అక్కా... మీ ఇష్టప్రకారమే పెళ్లి చేసుకుంటాను" అంది.

అందరి మనసూ తేలికపడింది.

★ ★ ★

జయకి పెళ్లైంది. భర్త ఎంతో యోగ్యుడు. పేరు సత్యమూర్తి. ఈ ఆర్నెల్ల కాలంలో మగవాళ్లపై ఆమె చేసిన ఊహాగానాల నల్లని మేఘాలన్నీ - తెల్లని స్వచ్ఛ హిమ సమూహమ్ములుగా మారిపోయాయి.

సుఖమయంగా రోజులు వెడుతున్నాయి.

ఓ రోజు భర్త ఆఫీసు నుంచి వస్తూ తీసుకొచ్చిన వార్త ఆమెని నిలువ నీయలేదు.

"ఎందుకండీ అలా వున్నారు?" అంది.

"ఏం లేదు జయా! నా ఫ్రెండు చెల్లెలికి మేరేజ్ ఫిక్సయింది. తీరా అంతా జరిగాక ఆ చేసుకోబోయే పెళ్లికొడుకే తన కన్న తల్లిదండ్రులకి ఆ అమ్మాయి మంచిది కాదని, తిరుగుబోతని ఆకాశరామన్న ఉత్తరం రాశాడు" అన్నాడు మూర్తి.

"మరి అతనే రాశాడన్న నమ్మకమేమిటండీ!" ఆశ్చర్యంగా అంది జయ.

"ఏముందీ అంతకు ముందు ఆ అమ్మాయి కోసం పడిగాపులు కాస్తూ వెంపర్లాడేవాడట. ప్రేమలేఖలు రాసేవాడట. ఆ దస్తూరీని బట్టి..."

"కట్టుకోబోయే మొగుడే ఆమె శీలాన్ని శంకించేవాడైతే - ఇక ఆమెని పెళ్లి చేసుకొన్నాక జీవితాంతం ఆమెని సుఖంగా ఏలుకొంటాడన్న నమ్మకేమేముంది? అలాంటివాడ్ని కట్టుకోవడంకంటే జీవి తాంతం పెళ్లి కాకుండా వుండి పోవటమే మంచిది. కొన్నాళ్లాగితే ఆమె మనసుకి తగ్గ వరుడు తానై వెతుక్కుంటూ వస్తాడు" అంది జయ.

"నువ్వు ధైర్యవంతురాలివి కాబట్టి అలా చెప్పగలిగేవు. కానీ ఆ అమ్మాయి చెప్పగలదా? తీరా పీటల దాకా వచ్చిన పెళ్లి ఆగిపోతే మళ్లా ఆమెకి పెళ్లౌతుందా?" అన్నాడు మూర్తి.

"మీ ఫ్రెండుతో ఆ బెంగేం పడద్దని అతని చెల్లెలికి చెప్పమనండి. ఉదాహరణకి మిమ్మల్నే తీసుకోండి. అయినా ఎక్కడవ్వాలని రాసిపెట్టి వుంటే అక్కడవుతుంది. నా పెళ్లి మొదట్లో పీటలదాకా కదా వచ్చింది. నాకు అదృష్టం వుంది కనుక - ఆ సంబంధం తప్పి మీలాంటి గొప్ప వ్యక్తిని, ఆదర్శ భావాలున్న వ్యక్తిని నా దైవంగా పొందేను" అతని వక్షంపై వాలుతూ గర్వంగా అంది జయ.

అగర్వం జయది కాదు. స్త్రీ జాతిది!

జీవితాన్ని సమర్థవంతంగా, బంగారు బాటగా మలచుకోవటంలోనే భవిష్యత్తు ఆధారపడివుంటుంది.

కుటుంబంలో బాల్యం నుండి వృద్ధాప్యం వరకూ ఎన్నో నిందలకు గురి అయి, ఎన్నో ఈర్ష్యాసూయలని తట్టుకొని, నిరంతరం తనకి ప్రశ్నలుగా ఎదురయ్యే సమస్యలని కడతేర్చుతూ, కడ వరకూ కష్టాలను తనలో ఇముడ్చుకొని ఓరిమితో బంధాలని, ప్రేమను పంచుతుంది - స్త్రీ!

ఉన్నతాశయాలు గల జయ - పీటల దాకా వచ్చాక, చేసుకోబోయే పెళ్లికొడుకైన అరవింద్ తుచ్ఛుడని తెలిసి, తన బ్రతుకు బలికాకూడదని - తనకు తానే మగపెళ్లి వారికి 'ఆకాశరామన్న' ఉత్తరం ద్వారా - తను సత్శీలురాలైనప్పటికీ - మంచిదాన్ని కానని రాసుకొని ఆ గండం నుంచి బయటపడిన విషయం ఆమెకే తప్ప ఇంకెవ్వరికి తెలుసు?..... ❑

